సావిత్రీ సతీత్వము

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౧

మన దేశమునందు సావిత్రీచరిత్రము తెలియనివారు లేరు. పిల్ల లాడెడి ఆటపాటలు, పామరు లాడెడి వీధినాటకములు, హరిదాసులు జరిపెడు హరికథాకాలక్షేపములు, విద్యాధికు లాడెడి ఆంగ రంగవైభవోపేతములగు సుప్రసిద్ధనాటకములు, సినిమాలోని మూగ బొమ్మలు, వేయేల - ప్రజారంజకమగు ప్రతికాలక్షేపమునందును సావిత్రీచరిత్రము చర్వితచర్వణముగా ప్రజలచే గౌరవింపబడుచునే యున్నది. ఈవిధముగా నవ్యక్తులగు బాలబాలిక లాడెడి ఖేలనములు మొదలుకొని కళాప్రవీణుల నాట్యపరిషత్తులవఱకును నెల్లరచే పూజ్యతమముగా నెన్నబడుచున్న ఈ సావిత్రి చరిత్రమునందు గల విశేష మేమి? ఆమె పాతివ్రత్యమహిమచే దండధరుని దర్శించి పెనిమిటి జీవములను గొనివచ్చుటయేనా? ప్రజలకు పరిచితమగు విషయ మిదియేకాని సావిత్రీచరిత్రమును పరిశీలించిచూచో నింతకంటె నధిక విషయములుగూడ కలవు. ఏవ్యక్తి జీవితమునందైనను మనుజుల నధికముగా నాకర్షించునది యావ్యక్తియొక్క అపూర్వత్యాగమే. త్యాగముకంటె ప్రజాహృదయము చూఱగొనగల విషయము మానవ జీవితములో వేఱొండు లేదు. అట్టిత్యాగము సావిత్రిజీవితమునందు మిక్కిలి పిన్నవయస్సుననే ప్రదర్శితమైనది. మఱియు అవివాహితలు, వివాహితలు, పూర్వసువాసినులనని ముత్తైగలుగా నున్న స్త్రీజాతి కంతకును నాదర్శనీయములగు విషయములు పెక్కులుగూడ నామె చరిత్రమునందు గలవు. ఆవిషయము లెట్టివో, భారతములోని సావిత్రీ చరిత్రముతో పరిచయము కలుగజేసికొనుచు నించుక పరికింతము.

మద్రదేశాధీశ్వరుండైన అశ్వపతియను రాజేంద్రుడు పదునెనిమి దేడులు సావిత్రీదేవినిగూర్చి తపంబుచేయ జనించిన తనయ సావిత్రి. ఇట్టి కలుగకకలుగక కలిగిన బిడ్డను తలిదండ్రు లెంత గారాబముగా పెంచుదురో చెప్పవలయునా? సాధారణముగా గారాబముచేసిన పిల్లలు చదువురాని మంకుపిల్ల లగుదురు. కాని సావిత్రి కట్లు విద్యా వినయములకు కొఱతగాలేదు. సర్వవిషయములలో అసదృశ యనిపించు కొనినది. తమ కొమార్తె మంచి విద్యాబుద్ధులుకలది కావలయుననిన తలిదండ్రుల కామె తొలుత సంతోసమునూర్చెను. కాని తరువాత విచారకారణ మయ్యెను. ఏలనన, ఇంత మంచిబాలకు తగినవరుడు దొరకవలయునుగదా! లేకున్న ఆమె విద్యావినయములు అడవిగాచిన వెన్నెలయేగదా! కావుననే

"కోరి జనపతి దనహార్మిసూతు జూచి
గుణవయోరూపముల కనుకూలుడైన
భర్త నెమ్మెయి దీనికి బడయువాడ
నొక్కొయనియెందు దడవుచుండె"

౨

ఇట్లుండ నొక్కనాడు నారదమహర్షి అశ్వపతిగృహంబున కరుదెంచి యారాజేంద్రునిచే సత్కృతుండై యుచితప్రసంగము చేయుచున్నాడు. ఆసమయంబున రాకుమారియగు సావిత్రి నెచ్చెలి పిండుతో వచ్చి తండ్రికి మ్రొక్కినది. మహారాజగు అశ్వపతి కాపుత్రికా మణిపై ప్రగాఢవాత్సల్యము. కాన పాదముల కెరగిన కొమార్తెను ప్రేమంబున లేవనెత్తి తల నిమురుచు, వెన్ను నిమురుచు ప్రక్కను కూర్చుండబెట్టుకొనినాడు. వివాహయోగ్యయైన కన్యను గాంచినప్పు డీ బాల కెక్కుడైన దగిన వరుని జూచితివా యని ప్రశ్నించుట సాధారణమేగదా! అటులనే నారదమహర్షి వివాహయోగ్యయైయున్న సావిత్రి వరపి "ఇక్కన్నియం దగిన వరున కొసంగక యిట్లేల యునిచి నాడ" వని యశ్వపతిని ప్రశ్నించినాడు. అందులకు జవాబుగా అశ్వపతి తా నక్కడక్కడ విచారించిన సంబంధముల నేకరువుపెట్టలేదు. మఱియు కన్యకు స్వాతంత్ర్య మిచ్చినంతనే కులమును, విద్యయు చూడక ఎవడు చిక్కినవాడుగా నున్న, వానినే వరించునని యీకాలపు పూర్వాచారపరాయణులవలె భయపడి విపరీతవాదమునుగూడ నేయలేదు. విద్యావినయసంపన్నయగు తన కుమారి యనురూప వరుని వరింపజాలునని యాయనకు దెలియును. కాన నారదముని సమక్షమున నాతడు సావిత్రిం గని

"తల్లి! నీగుణరూపవృత్తముల కెందు
దగిన వరు నీవ యిమ్ముగ వెదకి నెమ్మి
నీమనస్సు కెక్కిన నృపకుమారు
గోరి వరియింపు మిదియ నాకును బ్రియంబు"

అని యింపుమీర బల్కినాడు. చూడుడు అశ్వపతి యుచితజ్ఞత! 'నీగుణరూపవృత్తములకు దగిన నృపకుమారు నీవ విచారించుకొనుము,' అనినాడు. 'నీగుణరూపవృత్తముల'కనుటచే నీవుమంచి గుణవంతురాలవు గనుక అట్టి గుణవంతునే విచారించుకొనుమనియు, 'నృపకుమారు' డను

టచే అత డితరకులజుడు కాగూడదనియు, తండ్రి తన యభిప్రాయమును వెల్లడించినాడు. ఇదియొక విధముగా భావగర్భితమైన సలహో. అంతకంటె విపరీతాధికారమును తనతలపై వేసికొనలేదు. తండ్రియైనవాడు కన్యాశ్రేయార్థి గనుక యుచితానుచితములను మృదులముగా తెలియజెప్పవలయునుగాని కన్యయనగా తనయింటగల జడవస్తుసముదాయములలో నొకటియనియు, తనసొత్తయిన ఆపదార్థమును తానేవిధముననైన నిరంకుశముగా వెచ్చపెట్టవచ్చుననియు సావిత్రితండ్రి భావింపలేదు. అహా! నేటి తలిదండ్రులకును నాటి తలిదండ్రులకును ఎంతవ్యత్యాసము!

తండ్రి యిట్లు చెప్పగనే కన్యకాసహజమైన బిడియము విడువక సావిత్రి నావరించినది. కాని వరనిర్ణయభారమును ఉచితజ్ఞుడగు తండ్రి తనపైనే యిడుటచే సావిత్రి సిగ్గు నించుక దొలగించుకొని తాను వరించిన నృపకుమారుని నామధేయ మెఱిగించి యాతని తండ్రియగు సాళ్వభూపతి వైరిహృతరాజ్యుండును విగతనేత్రుడును నై భార్యాపుత్రసహితంబుగా కాననంబున వసించుచున్నా డనియు, అయినను నే నాతనినే వరియింతుననియు దృఢంబుగా బల్కినది. కుమార్తెయొక్క అభిప్రాయము తెలియగనే మద్రభూవరుడు నారదుని వంకజూచి, "సంయమిచంద్రమా! మాసావిత్రి చెప్పిన చిన్నవాడు మంచివాడేనా?" అనినాడు. తత్క్షణమే నారదుడు, "రాజేంద్రా! మీసావిత్రి వరించిన రాకుమారుడు ద్యుమత్సేనుని తనయుడైన చిత్రాశ్వు డనువాడు. నిత్యసత్యవాదియగుటచే సత్యవంతుండన ప్రసిద్ధుడైనాడు. ఆతని విద్యాగుణరూపశీలవిశేషంబు లసదృశములు" అని నారదుడు చెప్పుచుండగనే అశ్వపతిమో మింతగా వికసించినది. సావిత్రిసంతసము మేరలుమీఱినది. కాని సత్యవంతునిగూర్చి చెప్పుట నారదున కింకను పూర్తిగాలేదు. కాన తుదివాక్యముగా నాత డిట్లు పల్కినాడు: "వానియందు గీడు నొక్కటి గలదు. నేడుమొదలుగా నొక్కసంవత్సరంబునకు మృతిబొందు. ఇది నీకుజెప్పవలయుటచేసి చెప్పితిని". అశ్వపతి గుండె లవిసిపోయినవి. ఆయుష్మంతుడుకాని వానియం దెన్ని యోగ్యతలున్న నేమి? అట్టియల్లుని గోరెడి మాపు యెందైన నుండునా! కాన కూతుమొగంబు జూచి, "తల్లీ! ఇమ్మహాత్ముండు దేవరహస్యంబు లెఱుంగు. ఈతనివచనం బమోఘంబు. నీకు నట్టివరుం డేల? ఒండొక్కవరుని వెదకికొమ్ము" అని పల్కినాడు అశ్వపతి.

దేవరహస్యవేదియగు నారదమౌని తానువరించిన నృపకుమారునకు ఒక్కవత్సరంబుకన్న నెక్కువాయువు లే దనుచున్నాడు. అట్టి ఆయుర్విహీనుని వరింపనేల? వేఱొకని వరింపుమని తండ్రి హితము గఱపుచున్నాడు. తన మనంబో, ఇదివఱకే సత్యవంతునియందు లగ్నమైనది. తా నిప్పు డేమి చేయవలయును? సావిత్రి కిది యగ్నిపరీక్ష. సత్యవంతుడు రాజ్యచ్యుతుడై దారిద్ర్య మనుభవించుచు కాననంబున వసించుచున్నాడు. విద్యావినయసంపన్నుడగు నాతనియందుగల దారిద్ర్య మామె లెక్కసేయలేదు. కాని, ఏరాజకుమారుడు గుణరూపవిద్యావిశేషంబుల నసమానుడని తాను వరింప నెంచెనో, ఆతనితోడి సాంగత్యము తన కొక్కవత్సరమైనను లేదని నారదమౌని దృఢంబుగా బల్కుచున్నప్పు డేమిచేయనగును? ఆతనిని పెండ్లాడుట వైధవ్యమును కొనితెచ్చుకొనుటగాని వేఱొండు కాదుగదా! చూచిచూచి దుర్భరమైన వైధవ్యావస్థ తలపై వేసికొను టెట్లు? కాని యీ భవిష్యదాపదలను తలంచి సావిత్రి భీతురాలు కాలేదు. తనమనం బిదివఱకే సత్యవంతునకు సమర్పింపబడియుండుటచే బాహ్యతంత్రమగు వైవాహికక్రియ జరుగకున్నను తా నాతనిని పెండ్లాడినట్టులే. అట్టిచో నాతడు విగతజీవు డయ్యెనేని తాను భర్తను గోల్పోయినట్టులే. అట్టిచో వివాహతంత్రము జరుగకుండ నాపిన ఫలమేమి? మనోదత్తవాగ్దత్తక్రియాదత్తములలో నుత్కృష్టమైనది మనోదత్తమే. కాన తనచే వరింపబడిన రాకుమారుని జీవిత మత్యల్పమని తెలిసియు మఱొకని వరించుటకై యత్నింపక సావిత్రి తండ్రిం గని,

"వినుము మనోవాక్కాయము
లన మూడు దెఱంగులందు నంతఃకరణం
బనగు ప్రధానము గావున
మనమున నైకొన్నభర్త మానందగునే!

కాన సత్యవంతుం డెట్టివాడైన నగుంగాని రే నింక నొరుల వరియింపను" అని పల్కినది. త్రికరణములందును శ్రేష్ఠమైన మనంబునకు సావిత్రి యిచ్చిన ప్రాధాన్యము ప్రశంసనీయమైనది. అది తండ్రికి గూడ ధర్మయుక్తముగనే తోచినందున కా దనజాలకపోయినాడు. కాని అల్పాయుష్కుడగు వరుని దలంచిన మనస్సు తల్లడ మందుచున్నది. కాన నేమియు దోచక మద్రేశుడు 'కన్యనిశ్చిత మిట్లున్నది; వరుని యాయు విట్లున్నది. ఇక చేయవలసిన దేమి?' అని ప్రశ్నించినట్లుగా నారదునివంక జూచినాడు. నారదుడుమాత్ర మేమిచెప్పగలడు? ధర్మయుక్తములైన సావిత్రి వచనంబులు ధర్మవిదుండగు నారదుడుమాత్రము కాదనగలడా? కాన సావిత్రిని ప్రశంసించుచు,

"గానముల ప్రోక నీ యనుగుగూతురు దీనితలంపు మాన్పగా
మనకు నశక్య మింక ననుమానము లేల నరేంద్ర యింతి జ
య్యన నృపసూతి కిమ్ము కమలాననచేసిన పుణ్యగౌరవం
బునవయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుడయ్యెడున్.

ఆమెచేసిన సుకృతము మంచిదైన నతడే బాగుండును. ఇచ్చివేయు"మని నారదుడు ఆమె అదృష్టమును ఆమెనెత్తిమీదనే వేసి వెళ్ళిపోయినాడు. అశ్వపతియు కొమార్తెయిష్టప్రకారము వర్తించుట కనుమతించినాడు.

అహో! అశ్వపతి ఓర్పు, నేర్పు, ఔదార్యము! ఎంత సంస్తవనీయములో కనుడు! బాలిక వివాహవిషయములో కన్యకంటె తనకెక్కువ బాధ్యత లేదని యాతడు క్రియారూపముగా జూపుచున్నాడు.

తొలుత కొమార్తెకు వివాహవిషయములో సంపూర్ణమైనస్వాతంత్ర్య మిచ్చినాడు. ఆమె వరించిన రాకుమారుడు దైవికముగ రాజ్యవిహీనుడును దరిద్రుడును నైనాడు. దానికిని తండ్రి యాక్షేపింపలేదు. తరుపరి యాతడైనను ఆయుష్మంతుడుగా డని నారదునివలన తెలిసినది. అప్పుడుమాత్రము 'అమ్మాయీ! వేఱొకని వరించగూడదా?' అని మాట మాత్రముగా తన అభిప్రాయమును తెలియబఱచినాడుకాని నిశ్చిత చిత్తముగల సావిత్రి తన యభిప్రాయము వెల్లడించిన వెనుక ఆయన మరల మాటలాడలేదు. చూడుడు, ఎంత ఉచితజ్ఞుడో! ఇట్టిసందర్భముననే సంయుక్తజనకుడగు జయచంద్రుడు తన కహితుడగు పృథ్వీరాజును సంయుక్త వరింపగా నందులకు గినిసి యామెను పరిపరివిధముల నవమానించి తుదకు కూతు, నల్లుని నాశమొనర్చి, తానును జచ్చి, ఉభయకుటుంబములను నాశ మొనర్చెను. ఇప్పటి మనకాలపు జనకులు ప్రభుత్వదండనకు వెఱచియో, ప్రజలకు వెఱచియో అట్టిహత్యాక్రియలు జరుపకున్నను, కూతురుచెవి మెలివేసి మఱొకనికి తప్పక యిచ్చివైతురు. అయినను ఆబాధగూడ వారికి లేదు లెండు! వారికి కొమార్తె నడుగవలసిన పనియే లేదు. ఒకవేళ అడిగినను సావిత్రివలె విద్యావివేకములు లేని పసిబాలలుగదా ఈకాలపు పెండ్లికూతుండ్రు! వారి కేమి తెలియును? సరి, ఇక ప్రస్తుతాంశమునకు బోవుదము.

౩

సావిత్రిని సత్యవంతున కిచ్చుటకు అశ్వపతి నిశ్చయించినాడు. కాని పెండ్లియెచ్చట? నారలుగట్టి కూరలశనంబుగ నుగ్రవనంబులో నున్న యాద్యుమత్సేనమహారాజు కుమారుని వివాహమునుగూర్చి కలనైన తలంచియుండలేదు. భగవంతుడు పెట్టిన పెండ్లిగడియ వచ్చినప్పు డొకరి యత్నములేకనే పెండ్లిం డ్లగుచుండును. శుభముహూర్తము తానే చూచుకొని, ఉభయమంగళసూత్రములు తానే చేయించుకొని, పెండ్లికి కావలసిన సర్వసంభారములు, మంగళవాద్యములు తానే తీసికొని, పెండ్లి కొమార్తెను, పెండ్లి పెద్దలను వెంటనిడికొని శాత్రవాపహృతరాజ్యుండును, విగతనేత్రుండును నై కాననంబున తపస్స్థితి నున్న యాద్యుమత్సేనునికడకు తానే వచ్చినాడు మద్రేశుడైన అశ్వపతి.

ఆకోలాహలంబు విని సంభ్రమంబుజెంది ఆసందడి యేమియని యోచించుచున్నాడు ద్యుమత్సేనుడు. ఇంతలో అశ్వపతి యాతని సన్నిధికివచ్చి కొమార్తచే యాద్యుమత్సేనమహారాజునకు నమస్కారంబు సేయించి, 'నాపుత్రికయైన సావిత్రిని మీకుమారున కిచ్చి పరిణయంబుసేయ నాయత్తుడనై వచ్చితి' నని తా నేతెంచిన కారణము దెల్పినాడు. మఱియు 'నీకొమరుడైన సత్యవంతుడును, నాకొమరితయైన సావిత్రియు సాటిలేని గుణవంతులు, సమానరూపవంతులు; ఒకరి కొకరు తగుదురు. కాన ఈవివాహమునకు మీరు తప్పక అనుమతింపవలయు'నని తనయభిప్రాయమును అత డడుగకుండనే అసందిగ్ధముగ వివరించినాడు. ఆమాట వినగనే ద్యుమత్సేనునకు కడు భయ మైనది. సావిత్రి కడుసుకుమారి; గోముగా పెరిగినబాల. తలిదండ్రు లతిక్షేమంబున లాలించుచుండ, అసంఖ్యాకదాసదాసీజనంబులు సమస్తోపచారంబులు సల్పుచుండ మహావైభవోపేతంబులగు రాజభోగంబుల ననుభవించుచున్న రాజపుత్రి. ఎండ కన్నెఱుగని యాసుకుమారకన్యకారత్నము తమకు కోడలినిగా జేసికొనినచో నట్టడవిలోని యీపర్ణకుటీరమునందు తమతోబాటు కాయగసురులు దినుచు నుండజాలునా? ఇట్టి సందేహంబు లనేకంబులు మనంబున గలుగుటచే "సుకుమారియగు మీపుత్రికారత్నము మాతోబాటీవనవాసక్లేశముల కోర్చగలదా?" అనినాడు ద్యుమత్సేనుడు. శంకాసంకలితంబులగు నప్పలుకులకు కొమార్తె యోగ్యతయందు పరమవిశ్వాసముగల మద్రపతి తత్క్షణమే యిట్లు ప్రత్యుత్తర మొసంగినాడు:

"కలిమియు లేమియుఁ గ్రమము గా నవిపెందినచో జెలంగుచుం
గలుగుచు నున్కి ధీరుల ప్రకారమె లెస్సగ నింతవట్టునే
తెలియును జెప్పెదఁ గాననుమతీశ్వర విన్నయనంగ నేరనే
కొలదియు గాదు ధీరమతి గూతురు శేర్కొనఁ జాలు శెంపునన్".

మఱియు,

నీతోడ వియ్యమందం
జేతోగతి నాసజేసి చెచ్చెరనిట్లే
నేతెంచితి మత్ప్రార్థన
బ్రాతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్"

అని ప్రార్థించి నిష్ఠురము లాడినాడు, ఇక కాదను టెట్లు?

౪

సావిత్రీసత్యవంతుల వివాహము మహావైభవముతో జరిగినది. కూతునకును, అల్లునకును వస్త్రాభరణాదు లనేకంబులు బహుమానంబులుగా నొసంగి సావిత్రి తలిదండ్రులు తమ దేశంబునకు వెడలినారు. కాని వనవాసినియగు సావిత్రికి వస్త్రాలంకారము లేల? ఆ చీనిచీనాంబరములు, ఆమణిమయాభరణములు, ఆరాజభోగములు, ఆనవరసాన్నములు క్షణములో పరిత్యజించి వల్కలాజినవసనయై వదలక అధికభక్తి భర్తృశుశ్రూషాపరత నున్నది సావిత్రి. అకోడలు గావించెడి సముచితోపచారములకును, వినయప్రవర్తనమునకును పరితృప్తమానసులై యానందసాగరమున నోలలాడుచున్నారు అత్తమామలు. పుడమిపై నడుగిడియెఱుగని యారాకుమారి మృదులపాదములు ఆశ్రమప్రాంగణమునందలి కఱకు టిసుకపై నడచుటచే నెఱ్ఱగ కందుచున్నవి. జలకలశంబులు గొనివచ్చుటచే యామె భుజాగ్రంబులు నొచ్చుచున్నవి. స్థలభాండపారిశుద్ధ్యకృత్యంబులచే పల్లవసదృశంబులగు నామె కరంబు లరుణంబు లగుచున్నవి. కాని సావిత్రికి మనంబుననేని యసంతృప్తి లేదు, విచారము లేదు. పితృమందిరమున సమస్తరాజభోగంబు లనుభవించుచుండెడి యెట్టి యుత్సాహము, ఎట్టి యానందము ఆమె మోముపై తాండవించుచుండెనో, అట్టియుల్లాసమే యిప్పుడును. మనుజాని కష్టసుఖము

లకు తావలము సేయునది మనస్సుగాని కలిమిలేములుగావు. పరితృప్తమైన మనస్సునకు సుందరకౌశేయములైన నొక్కటే; వల్కలాజినములైన నొక్కటే. నవరసాన్నములైన నొక్కటే; కందమూలములైన నొక్కటే. రాజమందిరములైన నొక్కటే; పర్ణకుటీరములైన నొక్కటే. సావిత్రి యట్టి పరితుష్టచిత్తయగుటచేతనే సుఖమూర్తియయ్యె, వనవాస మామె కానందమునే గూర్చినది.

౫

ఎన్నిపనులు చేయుచున్నను, ఏవిధముగా వసించుచున్నను, నారదుడు చెప్పిన గండప్రదినము నేమఱక సావిత్రి లెక్కించుచునే యున్నది. సరిగా గడువుకాలము నాల్గుదినములలోనికి వచ్చినది. పరమనిష్ఠతో భగవతిని ప్రార్థించుటయే కర్తవ్యమని నిశ్చయించుకొనినది. కాని మనోవాక్కాయముల ప్రసక్కింపక యెట్టివారికైన భగవద్భక్తి లభ్యపడునుగదా! కాన సావిత్రి త్రిరాత్రోపవాసవ్రతమునకు బూనినది. సావిత్రి యుపవాసవ్రత మామెయం దత్యంతవాత్సల్యముగల మామగారి మనంబును సంచలింపజేసినది. కాన "అమ్మా! ఇట్టి కఠినవ్రతంబున కేల బూనితి" వని ప్రేమంబున ప్రశ్నించినాడు. కొమరునిపై తన యత్తమామలకుగల వాత్సల్యము సావిత్రికి తెలియును. వారికతడే జీవము. అట్టి వారిప్రాణములకు ప్రాణమైన కుమారుని మృత్యువర్తమానమును వారి కెఱిగించినచో వారప్పుడే యసువులను వీడరా? కాన తన ఉపవాసవ్రతకారణమును వారి కెఱిగింపక "నావ్రతభారంబునకు మీరు చింతింపవలదు. పరమశుభములు గోరి నేను దీనిని బూనితి" నని ప్రత్యుత్తర మొసగినది.

ఉపవాసవ్రతదినములు మూడును గడచిపోయినవి. నాల్గవదినము వచ్చినది. ఆదినమే తన ఐదువతనమును తుదముట్టించు దుర్దినము, నాడు సావిత్రి మిక్కిలి వేకువనే లేచినది. కాని మనస్సులో తుదిలేని సొద. కాలు సాగదు. అత్యంతమైన తొట్రుపాటు. కాని ఆమనస్సులోని వేదన నొక్కింతయైన నితరుల కెఱిగించుట వీలు లేదు. ఎంత బాధయైన మనంబుననే యిముడ్చుకొనవలయును. క్షమాశీలయగు సావిత్రి యాకష్టము నించుకేని బయల్పడకుండ నెప్పటియట్టులు ప్రాతఃకృత్యములను నిర్వర్తించి యత్తమామలకును, భర్తకును వలయు సపర్యలు గావించినది. మరల దేవీపూజకు సన్నాహపడుచున్నది. కాని మనస్సులోని యారాటముమాత్ర ముడుగుజాడ లేదు. ఏయాపద రానున్నదో, ఆయాపదను తొలగించెడు చల్లని యూరటవాక్యము కొఱకామెమనస్సు పరితపించుచున్నది. కాని కష్ట మిట్టిదని చెప్పినగదా, దాని కెవ్వరైన పరిహారముగాని, ధైర్యముగాని చెప్పుదురు! తనయాపద నొరుల కెఱిగింపరానిదిగా నున్నది గదా! ఇక నామె నోదార్పువచనంబు లాడువా రెవ్వరు? నిత్యము అత్తమామలకును, ఆశ్రమవాసులగు తక్కిన పెద్దలకును నమస్కరించుట సావిత్రికి వాడుక. ఆదినమును వారికి నమస్కరించినది. వారెల్లరు సౌభాగ్యవర్ధనంబుగ దీవించినారు. క్షుధాపీడితునకు రుచ్యాహారమువలె నా పెద్దలయాశీర్వచన మామె కెంతయో ఆప్యాయముగా నుండెను. కాన నాడు పెద్దలగు వారికెల్ల పదింబదిగ మ్రొక్కి, వారిచే పలుమాఱు 'సౌభాగ్యవతీభవ' యనిపించుకొనినది. 'ఇంతమంది పెద్దల యాశీర్వచనము పొల్లుపోవునా? నాసౌభాగ్యమునకు మోసము వాటిల్లునా?' అని తనమనంబున తానే సంతుష్టి నందినది. త్రిరాత్రోపవాసవ్రతము పూర్తియగుటచే నాల్గవనాడు పారణము సేయుమని మామగారు సావిత్రికి జెప్పిరి, "నే నీదినము సూర్యాస్తమయమైన వెనుకగాని భుజింపరాదు. నేను వ్రతారంభమున చేసికొనిన నియమ మిది"అని సావిత్రి వాక్రుచ్చినది.

౬

తలిదండ్రుల అగ్నిహోత్రాదికంబులకు సమిత్కుశాదులను, పూజలకు పత్రపుష్పంబులను, ఆహారంబునకు ఫలమూలాదులను తెచ్చుట మునికుమారుల వంతు. సత్యవంతుడుగూడ ప్రాతరనుష్ఠానంబులు దీఱగనే నిత్య మదియే పని చేయును. కాన నాడును త్రాడు, చిక్కము, గరిడి, గొడ్డలి మున్నగు వస్తువులు తీసికొని యడవికి బయలుదేరినాడు. నాడు భర్త నొకక్షణమైనను విడనాడుటకు సావిత్రి కిష్టము లేదు. కాన తానుగూడ భర్తతో బాటడవి కేగదలంచినది. ముందుగా మగని నడిగినది. "సావిత్రీ! మూడుదినములనుండి యుపవాసముచేసి మిక్కిలి శ్రమగొని యున్నావు. కోరకకోరక నేడడవిమీద గోరి కేల? ఈదినము మానుము, ఊపుతప్పక తీసికొనివచ్చెద" ననినాడు సత్యవంతుడు. "మీరుపోబోయెడి యరణ్యము కడు సుందరముగా నుండునట! దానిని చూడవలయునని నాకు మిక్కిలి కుతూహలముగా నున్నది. ఉపవాసపు బడలిక నా కేమాత్రము లేదు. నా కట్టులైన ఆయడవిని చూపరా? నాచనవు దీర్పరా?" అని పెనిమిటిని వేడికొనినది సావిత్రి. ఇక ప్రేయసికోరికను నిరాకరించుటకు చిత్తమునకు బుద్ధిపుట్టలేదు. కాన "అటులయిన మాతలిదండ్రులకు జెప్పి వెళ్లుదము ర" మ్మని భార్యను వారికడకు గొనిపోయినాడు. సతీపతు లిరువురు వారి పాదంబులకు బ్రణమిల్లిన వెనుక సావిత్రి తనకోరిక నత్తమామల కెఱిగించినది. ఎన్నడును, ఏదియు నడుగుట యెఱుగని సావిత్రి నేడు కాననంబును చూడ గోరుటవలన వారును కాదనలేదు.

౭

"సావిత్రీ! ఇదిగో! ఈ కమలాకరంబున రాజహంస లెట్లు విహారంబు సలుపుచున్నవో చూచితివా! అహో! ఈ ఫలవృక్షంబున ఆకులే గానవచ్చుట లేదు; ఎటుచూచిన పండ్లు, కాయలే. ఇదిగో! ఈతీగ నెల్లెడలను విరబూచిన పువ్వులలోని మకరందము త్రావి యీ తేటితండము లెట్లు ఝుంకారము సేయుచున్నవో కనుము! ఇదిగో! యిటునిటు, దోరపండ్లను తెగతినిన యాచిలుక లెట్లు రొదసేయుచున్నవో!" అని అరణ్యముజూడ నేతెంచిన ప్రేయసికి వేడ్కల జూపుచున్నాడు సత్యవంతుడు, కాని సావిత్రి కాతనిపలుకులు చెవి

దూరుటయే లేదు. ఆవిషెన సౌందర్య మంతకంటె కన్నులకు పొడకట్టుటలేదు. చూపినవాని కానవానము లేదు; చూపనివానికి విచారము లేదు, ఆతడు చెప్పెడుమాటలకు, చూపెడువస్తువునకుగూడ ఒక్కటే అర్థము లేని "ఊ! ఊ!". ఆమె రెండుకన్నులు పెనిమిటిమొముమీద; ఆమె చిత్తమంతయు రాగల యాపదమీద.

సత్యవంతుడు పండ్లుకోసి గరిడి నింపినాడు. కుశలుకొన్ని త్రుంచి కట్టకట్టినాడు. ఇక కాష్ఠఖండనంబు సేయవలయును. ఒకఎండు మానును చూచి కొట్టుటకై గొడ్డలిని చివ్వున పైకెత్తినాడు. కాని వ్రేటు పడలేదు. చేతులు చచ్చుకొనిపోయినవి. గొడ్డలి నేలబడినది. ముఖమున కళ దప్పినది. ఆయాసము పుట్టినది. పాపము! సత్యవంతునికి రావలసిన యాపద రానేవచ్చినది.

"ఒడలుపశంబుగాదు భ్రమ నొందినయట్లు మనంబు దూలెడిం
గడుశిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టిన
య్యెడు నిలువంగనోర్వ నొక యించుక సేపు శ్రమంబుదీఱనీ
తొడ శయనింతు"

అని సత్యవంతుడు వచ్చి సావిత్రితొడలపై శిరంబుమోపి వ్రాలినాడు. ఏప్రాణేశ్వరుని యసువుల నిలుప దాను మహావ్రతము సలుపుచున్నదో, ఆప్రాణేశ్వరుడు తన కన్నులయెదుటనే, తన తొడలమీదనే వ్రాలి, సోలి నిశ్చేతనుడైనాడు. ఇక చేయవలసిన దేమి? అభయంకరగహనంబున నిక దిక్కెవ్వరు? తన జన్మదాయినియైన భగవతియనుగ్రహ మేమైనది? తన సుకృతవిశేషంబుచేతనైన విభుండు పరిపూర్ణ చిరాయురుపేతుడయ్యెడు నని యూహించిన నారదమునితలంపు లేమయ్యె? ప్రొద్దుప్రొద్దుననే లేచి తాను పాదంబులకు బ్రణమిల్ల సౌభాగ్యవర్ధనంబుగ దీవించిన పెద్దల యమోఘాశీర్వచనంబుల ప్రభావం బేమాయె? పరమభక్తితాత్పర్యంబులతో తాను నోచిననోములెల్ల వ్యర్థమై తనకట్టియాపద తప్పకపోయిన నిక వ్రతాదికంబు లొనర్చిన ఫలమేమి? అనిహతాశంబునను, శోకదందహ్యమానంబును నగు చిత్తంబున వితర్కించుచు, వెఱ్ఱిచూపులు చూచుచు అట్టే కూర్చున్నది సావిత్రి.

౪

ఎవరియేడ్పు లెట్లున్న నేమి? దండవిధాయి యయినవాడు తన పనిని తాను చక్కబెట్టుకొనవలయునుగదా! విసిగిగాని, జాలిబూనిగాని తనపనియందు ప్రమత్తుడై చరించిన బ్రహ్మదేవు డూరకొనునా? మంచిహోదాగల ఉద్యోగము పోగొట్టుకొనినచో మరల నెన్నిపాట్లు పడినను వచ్చునా? ఈకటికియుద్యోగముపై కన్నువేసియున్నవారు తక్షణమే వచ్చి తన్నుకపోరా? కాబట్టి దేవతా-మేజస్ట్రీటైన యమధర్మమహారాజులుంగారు గొప్పవారిని బట్టుటకు గొప్పయుద్యోగియే వచ్చునట్లు పుణ్యాత్ముడైన సత్యవంతునిప్రాణముల గొనిపోవుటకు ప్రధానాధికారియయిన తానే స్వయముగా వచ్చినాడు. నల్లని కాటుకవంటి బలిష్ఠశరీరము, భయంకరమైన తెల్లనికోరలు, కణకణలాడెడి నిప్పుకణికలవంటి ఉజ్జ్వలములయిన కన్నులు, పచ్చని కట్టుపుట్టము, భయంకరమైన వదనము, హస్తంబున నిఖిలప్రాణిచయభీతిదంబగు పాశంబు, ఉద్యోగమునకు దగిన యాకృతి, ఆకృతికి దగిన యుద్యోగము గలిగి జగజ్జనసంత్రాసకరుండైన యముండు సత్యవంతుని జీవహరణార్థంబై యాతని సమీపించినాడు. చేసినయత్నము విఫలమై పోయినది. తన ప్రియపతియైన సత్యవంతుడు విగతజీవుడైన తరువాత తా నింకను బ్రదికినను నొక్కటే, బ్రదుకకున్నను నొక్కటే. జీవములకు జీవమైన జీవితేశ్వరుడు పోయిన వెనుక నామె కింక జీవములపై నాస యేమున్నది? కాలుని కన్నులార చూచినది. భర్తృజీవమును గొని పోవుట గమనించినది. అధికారియైనవాడు కన్నులబడినప్పుడు, ఆతని నెదిరించుటకు జాలనప్పుడు ఆతని యనుగ్రహమునకై యత్నించుట తుదియత్నముగదా! కాన సావిత్రి తనతొడపైనున్న భర్తృశిరంబు క్రిందనిడి, చయ్యన లేచి యాతనికి నమస్కరించి "బాబూ! తమ రెవ్వరు? ఎందునిమిత్తమై యిందులకు విజయముచేసితి"రని వినయంబున ప్రశ్నించినది. "అమ్మా, నేను కాలుడను. పుణ్యాత్ముండగు నీభర్త జీవమును గొని పోవుటకై వచ్చినాడ" నని మెత్తబడినచిత్తంబుతో ప్రత్యుత్తరం బొసగి, సత్యవంతుని జీవమును పాశబద్ధంబు గావించి యముండు నిజదిశాభిముఖుండై సత్వరమే వెడలిపోవుచున్నాడు. సావిత్రి కేమియు దోచదు. చేతులు గడగడ వణకుచున్నవి. గుండెలు తటతట కొట్టుకొనుచున్నవి. కాళ్లు తడబడుచున్నవి. భర్తను గొనిపోవుచున్న దేవతామూర్తి దృష్టిపథమునుండి తొలగిపోవుచున్నాడు. ఎటులైన నాతనికాళ్ల వ్రేళ్లంబడి, వేడి విభుని జీవమును రక్షించుకొనవలయునని మనంబున పెల్లారాటము. పాపము! సావిత్రి ఆధర్మమూర్తి నొక్కింత ప్రార్థించి చూడవలయు నను కోరికతో ప్రాణేశ్వరు శరీరం బొకచో దాచి యముని వెంబడించినది.

సావిత్రి తన్ను వెంటాడివచ్చుటను యముడు చూచి, "బాలా, నీవేల నావెంట వచ్చుచున్నావు? ఇకముందు త్రోవ నీకగమ్యము. నిలువుము" అనినాడు.

" పతులెందు జనిన నచటికి
సతులకు జనవలదె నీ ప్రసాదమునను మ
త్పతిభక్తికతమునను సం
స్తుతముగ నాకరుగరాని చోటులు గలవే!

అంతియేకాదు. "సకలమార్గములందును ధర్మమార్గంబు ప్రధానంబు. అట్టి ధర్మంబున కాధారము సజ్జనులని విందుము. అట్టి సజ్జనదర్శనం బెప్పుడు వ్యర్థగాదుగావున సజ్జనశేఖరుండవగు నీకైన సందర్శనంబువం బరమసుఖంబుం బొందక యేను రిక్తజనంబులతెఱంగున నెట్లు మగుడుదునని సావిత్రి యముని ధర్మయుక్తంబుగా బ్రశ్నించినది. సావిత్రి ధీవిశేషం బసమానము. అటు లాతనికి ధర్మమార్గం బుపదేశించుచు నాతని యనుగ్రహముపై విశ్వాసమును సూచించుచున్నది. ఇట్లు తన

పతీధర్మమును ప్రకటించుచు, తన పతిభక్తిని వెల్లడించుచు, తనకు సాధ్యముకానిది లేదని తన ప్రభావమును వివరించుచున్నది. ధర్మ్యంబులును, సకరుణంబులును నగు సావిత్రివచనంబులు విని యామె కేదేని యుపకారంబు సేయక ముందుకు సాగిపోవ కాల్గాడక యముడు "బాలా, ధర్మయుక్తంబులైన నీవచనంబులకు మెచ్చితిని. కాన నీభర్తజీవము దక్క నొక్క వరం బిచ్చెద, వేడు" మనినాడు. తనయభీష్టమైన భర్తజీవితమును యముం డెడగా నుంచి వరం బిచ్చెద ననినందులకు సావిత్రి యాతనియందసంతృప్తచిత్త కాలేదు; అవిశ్వాసమును జూప లేదు. ఆతని చిత్తానుసారముగా వర్తించుటవలననే యాతని యనుగ్రహమును సంపాదింపనగునని యామె అభిప్రాయము. కాన ఆతఁ డిచ్చిన వరంబు నుపయోగించుకొనుటకు సావిత్రి నిశ్చయించినది. అయిన తాను కోరవలసిన వరం బెద్ది? అందును తాను పతీధర్మంబు మీఱరాదు. సాధ్వీమణులకు భర్తకు తరువాత సేవ్యులైనవారు అత్తమామలు. కాన నయనవిహీనుండై యల్లాడెడి తనమామగారు లబ్ధనయనుడగునట్లు వరంబు కోరినది. "అటులనే యగుగాక!" అని ప్రేతపతి సావిత్రికోరిన వరం బొసంగి తనత్రోవ బట్టినాడు. సావిత్రియు మరల నాతనిని వెంబడించి నడచుచు,

"ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింసయొనర్పబూన రె
ఱ్ఱెడలను దీనులం గరుణ నేర్పడ బ్రోవన మాట లిచ్చుచో
గడమవడంగ నీకెదిరి కాంక్షితముల్ దుదిముట్టదీర్తు రె
క్కుడు మదిగూర్తు రాశ్రితులకట్టి వినుమిన్నియు నార్యధర్మముల్

నీవెఱుగని దెయ్యది
దేవోత్తమ, ధర్మగతుల తెఱగెల్ల భవ
ద్భావాధీనముగుటగా
నే తెలిసితి నీవు ధర్మదేవతయనగాన్

సమబుద్ధితోడ ఆయాజీవుల కర్మంబునకు దగిన ఫలమును సమకూర్చుటచే నీవు సమవర్తియని పేరుగాంచితివి. భూతముల యమించుటచే యముడ వనంబడితివి. కల్మషముల శమింప జేయుటచే శమనుడ వైతివి." అని యాప్రేతపతిని పెక్కుభంగుల స్తుతించినది. ఈమాట సావిత్రి ఆర్యధర్మముల నగ్గడించుచు ఆశ్రితవాత్సల్యమును నిరూపించినది. మనోవాక్కర్మంబుల నేరికిని హింసయొనర్పరాదనినది. దీనులను బ్రోవవలయు నన్నది. ఒకరి యభీష్టమేదైన నీడేర్చ దలంచినచో నది పూర్తిగా నీర్పవలయునుగాని కొఱతలు పెట్టరాదనినది. నీ వీ ధర్మమూర్తివైనప్పుడు నీకు దెలియని ధర్మగతు లేమున్న వనినది. మనోజ్ఞమైన యీసంభాషణంబులు యమునకు సంతసముగూర్చినవి. కాన "హృషితాంగుడనైతిని కల్మషరహితంబులైన నీసమంజసభణితులన్" అని మెచ్చి "ఇంకొక వరము వేడు" మనినాడు. వైరులచే నపహరింపబడిన మామగారి రాజ్యము మరల వారికి ప్రాపించుట ద్వితీయవరముగా సావిత్రి కోరినది. అటులనే యని వైవస్వతుడు ముం దడుగువైచినాడు. సావిత్రి యాతని వెంట నడచుచునే యున్నది. సావిత్రి తన్ననుగమించివచ్చుట యమునకు చరణశృంఖలముగానున్నది. మరల ఆగి, "బాలా! ఇక నీవు రావలదు. ఇకముందు మార్గమంతయు దుర్గమంబైనది. నీవటవచ్చు సెలవు లేదు. రాజాలవు." అనినాడు.

"ధర్మాత్ములు దమసలిపెడు
ధర్మక్రియ దప్ప రెట్టి దశలందును హా
హార్మియు దాపము బుట్టవు
ధార్మికహృదయముల బ్రమధర్మాత్మా!

ధార్మికహృదయులకు తాపమోహము లుండునా? మోహావేశులగు వారు ధర్మానుష్ఠానము సేయగలరా? పాతివ్రత్యమునవ్వెడు నాకు పతి ననుగమించుట ధర్మమైయుండగా మార్గము సుఖమైనదిగాదని యాతని ననుగమించుట మానితినేని ధర్మమార్గము తప్పినదానను గానా? కాన నాస్వధర్మమైన పత్యనుగమనంబు సెవ్విధంబున నైన, నెట్టిదుష్కరపథంబులందైన మానజాలను." అని సావిత్రి పలికినది. జీవులను శాసించుటయందును, శిక్షించుటయందును వజ్రహృదయుడై ప్రవర్తించెడి దండధరుని చిత్తము సావిత్రిమృదులవచనంబులచే నవనీతసదృశమై కరగి ఆమెదెస కృపయత్నముగా నాకృష్టంబగుచున్నది. ఆమె ధర్మవాక్యంబులనెడి చిక్కములో పిట్టవలె చిక్కువడిపోవుచున్నాడు యముడు. ప్రకటధర్మాని శేషతత్పరయగు నాసాధ్వీమణికి మఱియొక వరమీయ ధర్మునిచిత్తము కుతూహలత జూపినది. "బాలా! ఇంకొక వరం బొసగెదను. నీభర్తజీవముదక్క నేదైన కోరుకొ" మ్మనినాడు. మామగారి క్షేమలాభంబులకై రెండు వరంబులు బడసినది. ఇక తన జన్మమునకు కారకులైన తలిదండ్రులకుకూడ నేదేని వరలాభంబు గలుగజేయుట తనధర్మము. అపుత్రకులైనవారికి పుత్రలాభంబుకంటె శుభమైన వరం బెద్ది? కాన అపుత్రకుండైన తనతండ్రికి పుత్రశతలాభం బనుగ్రహింపుమని యంతకుని వేడినది. "సరే, నీకోరిన వరంబిచ్చితి నింక వెనుకకు మరలుము. నేడు నీవు చాలాదూరము నడచివచ్చితివి. చాల డస్సియున్నావు. ఇకనైన నీవు నిలుచుట మంచిది." అనినాడు శమనుడు.

"వాకుదప్పిరొక్కడిది మనంబు భర్తృ
చరణపంకజసక్తమై కరము భక్తి
నలరుచున్నది సతులకు నన్యమెట్టి
దియును ధర్మమె భర్తృసంశ్రయమెగాక!"

అని సావిత్రి యమునకు బ్రత్యుత్తర మొసగినది. కావలసిన వరము చేకూరలేదు. అవినయమై ధర్మున కింకను జయగలుగ లేదు. ఇప్పటికే తాను బహుదూరము నడచి వచ్చినది. ఇక నడువవలసినమార్గము కఠిన కంటకశిలాపరివృతంబగు దుర్గమప్రదేశము. తాను సుకుమారియగు రాజపుత్రి. ఎన్నడును నెట్టికష్టములను ననుభవించియెఱుగనిది. మనస్సులో దుర్భరంబగు పతివియోగవ్యథ. ఆపైని త్రిరాత్రోపవాసవ్రతముచే మిక్కిలి నీరసించియున్నది. కేవలము సతీధర్మప్రేరితమైన ధర్మ

తన జ్ఞానశక్తియు, దానిసాఫల్యమెట్లొనర్పఁగొనవలయునను తెలివియు నన్ను ఆమెకడ నిక పెట్టిబలమును లేదు. అతిశాంతముచేతనే ఆమె దుర్గమ పథంబున వక్రమంబున నడచుచున్నది. తొట్రుపాటులేక యమునితో భాషించుచున్నది. కాని మాటిమాటికి 'ధర్మ్యజీవముదక్క' అని వరంబు లొసంగుటచే ఆమెకు నిరాశ గలుగుచున్నది. అందున ఆమె గమనసామర్థ్యముగూడ సన్నగిల్లుచున్నది. అయిన తన కితరవరంబు లొసంగుచు యముడు కాలక్షేపము చేయనేల? తనయం దింకను కోపలేశ మేదైన గనిపెట్టి యిట్లు తన యందు ప్రసన్నుడుగాకయున్నాడా? అటులనే యగునో దానికి సమాధానముగా

ఆత్మధర్మనిరతులైన పుణ్యాత్ములు
దుర్గతులు సమస్తదురితములును
శాంతిబొందువారి సంసర్గమున తీర్థ
భూతమతులువారు భూతలమున.

అట్టిపుణ్యాత్ములవలననే సూర్యచంద్రులు తమగతులు ఒప్పుచున్నారు. సముద్రములు తమ మేరలు మీఱకున్నవి. కులనగంబులు చలనంబు లేక నిలిచియున్నవి. పుడమి జంగమస్థావరాత్మకంబైన సర్వవస్తు సముదాయమును ధరించుచు నకంపితయై నిలిచియున్నది. అట్టి ధర్మనిరతులలో నొక్కఁడవైన నీసన్నిధానంబున నాదురితము లెల్ల నివారితములై నవి. నాన నీయనుగ్రహార్హ" నని సూచించినది. అంతకును అంతకును ప్రసన్నుడు కాఁబడుటచే

"ఏడుమాటలాడినయంత నెట్టివారు
సార్వజనులకు జుట్టంబు లగుదురనిన
నీరసమాలాపసంసిద్ధి జేసినీకు
నేనుజుట్టమనని చేయ నేలచెప్ప

కావున మిత్రమనోరథం బకల్యాణకృత్యంబుగా జిత్తగింపు"మని ప్రార్థించినది. సావిత్రినోటినుండి వెలువడునవి మాటలేకాని కత్తులు, కటారులు కావు; త్రాళ్లువేళ్లు అంతకంటెకావు. అవి ఆతనిని కొట్టలేవు, కట్టలేవు. కాని సర్వజీవులను భయమహాశబ్దములనుగావించు యముని అమృతపదజాలముచే నిబద్ధుంగావించుచున్నవి. అగును, మనకర గించెడు మార్గమును, శ్రవణానందంబును పొందక, ధర్మము నిరూపించెడు భావము. ఇన్ని విధముల కొప్పియున్న సావిత్రి మనోజ్ఞమంజుల ధర్మాలాపంబులు కాలుండైన వినుగాక, ఎట్లు త్రోసిపుచ్చగలడు? సుగుణవతియు, సాధ్వియు, ధర్మ్యవినోగనిగ్రాసలచిత్తయు, తనకటాక్షము నర్థించి తనవెంటబడి వచ్చుచున్నదియు నగు మానవతీమణికి నిర్బంధ మొసంగియు నామెయభీష్టవరం బొసంగక రిక్తహస్తగా విడిచి పంపెనేని యాతడు ధర్మదేవతయను నభిధేయం బెట్లు నిల్పుకొనగలడు? కావున ఆమెదెసం గనుంగొని "నీకుం బ్రసన్నుండనైతి నభీష్టంబైన వరం బొక్కటి యిచ్చెద వేడు" మనినాడు సమవర్తి. 'నీపతిప్రాణముదక్క' అను మినహాయింపులేని యమునివాక్యంబు వినఁగనే సావిత్రి కపరిమితానంద మైనది.

"మతిసత్యవతుని జీవిత
మతియిమ్మగ దొలగబెట్టె యుక్తంబుల ని
చ్చెదనని పలుకదు మునునీ
వదియిప్పుడ లేద యింక వదిలెద ప్రీతిన్"

అని యముని యభిప్రాయ మెఱుంగుటకు ముందు తా పల్కఁబోయిన వరంబు నంగీకరించి

"పతివిరహంబుదుస్సహము ధర్మ్యవివాక్యతర్లుగకాంత మా
పితయును సర్వమంగళవిశేషములందును గాన మత్ప్రియుం
డగులితకీర్తిశాలి సుగుణాఢ్యుడు సౌశ్వమునందు లబ్ధకీ
ర్తుడుగ నిమ్ము ధర్మపథదీపరిరక్షణ పుణ్యదీక్షణా!"

అని తన యుద్దిష్టార్థంబైన ధర్మ్యజీవంబునెడ అభ్యర్థనం బడిగినది.

ఆమెయందు ప్రసన్నుడైయున్న కృతాంతుడు తథాస్తు యని సత్యవంతుని పాశవిమోచనము గావించి "కొనుము నీ మనఃప్రియుని" అనినాడు. అంతియేగాక "నన్నూరేండ్లు జీవింపును; నూఱుగురు పుత్రుల గనును, అనేకాధ్వరంబులు సల్పును. నిజవంశాలంకారుడై కీర్తిమంతుడై విరాజిల్లు" నని వాక్రుచ్చి యముం డదృశ్యుడైనాడు. సుప్రతీయయగు సావిత్రి సఫలమనోరథ యైనది. మహోత్సాహంబున ధర్మవార్త్తికి మనంబున బలుమారు ప్రణమిల్లి శీఘ్రగమనంబున సత్యవంతుడున్న చోటికిఁ బఱచి ఆతని సెప్పటియట్లు తొడలపై నిడుకొని యెప్పుడు లబ్ధచేతనుండగునని నిరీక్షించుచు నున్నది.

౬

"కడు దడవు నిద్రవోయితి, సతీ, నను దెలుపవలదా?" అనుచు చిత్రాశ్వుడు లేచినాడు. సుప్రశాంత్మయగు సావిత్రి చచ్చిబ్రతికిన మగని గని యెంత ముదితురాలయ్యెనో, వివరించుటకు పదములు చాలవు. కాలుని పేరుఁబు సత్యవంతున కించుక యెఱుకలేదు. తాను ప్రాణయుక్తుడు కాగనే సత్యవంతుడు సావిత్రి నదియే ప్రశ్నించినాడు. కాని శాంతచిత్తయగు సావిత్రి తన ప్రజ్ఞాపాటవ ప్రగల్భవాక్యంబు లేమియు పలుకలేదు. అంతయు రేపు చెప్పెద నని యామని సమాధానపఱచి తలిదండ్రులు తన్నుగానక యెంత పరితపించుచున్నారో యని విచారించెను. పిమ్మట శోకార్త్తి నవమృణాలమృదులంబులగు భుజంబుల గౌగిలించి లేవనెత్తి జీవితేశ్వరు హామబాహువు నిజవామ భుజంబుపయి నిడికొని దక్షిణహస్తంబున నతనిఁ గ్రుచ్చి కౌగిలించి మందగమనంబున నాశ్రమోద్దేశంబునకు గొనిపోయినది.

అటు ద్యుమత్సేనునకు నేత్రలాభంబు గల్గినది. కాని కుమారు డెక్కడ? కుమారుని గానని కన్నులు కలిగియేమి? కలుగకయేమి? ప్రజ్ఞాహీనుడైయుండియు తన తనయుని మేను చేతుల నిమురుకొన్నను

నాతనికి సంతుష్టియేగాని కన్నులువచ్చి కొమరుడు కనుపింపకున్న నాతని కేమి సంతోషము? చెప్పవలసినదేమి? ఆతలిదండ్రుల రోదనం బున కంతు లేదు. అర్ధరాత్రమైనది. సావిత్రీసత్యవంతుల జాడ గాన రాదు. ఆకస్మికంబుగా ద్యుమత్సేనుని కన్నులు వచ్చుటయు, నిత్యము సంజపడకనే యింటి కేతెంచు సత్యవంతుడు నిశీథంబునకైన నింటికి రాకుండుటయు గని సమీపాశ్రమవాసులైన తాపసు లెల్లరు విస్మిత చిత్తులై సత్యవంతుని యాగమనంబునకై పలుదెసల వరయుచు వృద్ధుల నోదార్చుచున్నారు.

ఇంతలో సావిత్రీసత్యవంతు లాశ్రమంబునకు జేరుకొనినారు. వారిని జూడగనే వృద్ధుల దుఃఖాశ్రువు లానందబాష్పంబులుగా మారి సత్యవంతుని మూర్ధము నభిషేకించినవి. తరువాత "నాయనా! ఇంత రాత్రి వఱకు నడవి నేమిచేయుచుంటి" వని తలిదండ్రు లడిగినారు. తా నడవికేగి నదిమొదలు కాష్ఠచ్ఛేదనంబు సేయబోయి వివశుడై పడిపోవునంతవఱకు చెప్పి తరువాత నేమైనదో నా కెఱుక లే దనినాడు సత్యవంతుడు. సమ యోచితముగా తరువాత వృత్తాంతమును పూర్వోత్తరసందర్భములతో మేళవించి తన వివాహమునకు పూర్వమే నారదమహాని సత్యవంతుని గండమునుగూర్చి చెప్పుటయు, చెప్పినను తా నాతనినే వరించి యాతడు మృతిజెందుదినంబును మనంబున లెక్కించుకొనుచుండుటయు, తా నందు లకే యుపవాసవ్రతము బూనుటయు, నా డెల్ల యాతని వెంబడి తాను వెంటాడి తిరుగుటయు, తరువాత నాతడు విగతజీవుడగుటయు వివ రించి సావిత్రి యనంతరము తాను యముని దర్శించినవిధము, ఆతనిచే దాబడసినవరములు సర్వము చెప్పినది. ఆహా! అప్పు డా యత్తమామ లకు గల్గిన యానందము వివరించుటకు సాధ్యముగాదు. కావుననే వారిరువు రొక్కమాటుగా

"ఆపత్సముద్రమగ్న
మైపోయెడు నస్మదన్వయము పెంపెసగం
దేపయయి కడనబెట్టిన
నీపుణ్యచరిత్ర కీర్తనీయము తల్లీ!"

అని ప్రేమాతిశయంబుగా శ్లాఘించినారు. యమునివరములు తం త్వరపడే సఫలమైనపుడు తక్కినవిమాత్రము తొలుపోవునా? శమునివరప్రభా వంబున ద్యుమత్సేనునివైరి హతుండగుటయు, పూర్వప్రభునియందు భక్తిగల సాళ్వదేశపుప్రజలు పట్టపుటేనుగుతో ద్యుమత్సేను డున్న కాననంబున కరుదెంచి యాతని నచ్చటనే పట్టాభిషిక్తుం గావించి పుత్ర యుక్తుండగు నాతని పట్టపుటేనుగుపై నెక్కించి మహావైభవంబున నగ రంబునకు గొనిపోవుట మఱుదినంబుననే జరిగినది.

"తనమగని నత్తమామల
జననీజనకులను దన్ను సకలకులంబున్
ఘనముగ సముద్ధరించెను
జనవర సావిత్రి దక్కుచరితము కంటే!"

అని మహాసాధ్వియగు సావిత్రిచరిత్రమును మార్కండేయమహాముని యుధిష్ఠిరునకు వివరించునెపంబున లోకంబునకు జాటినాడు.

౧౦

తపస్వినియగు సావిత్రి చరిత్రము ముగిసినది. అవివాహితయై వరాన్వేషణారంభమునుండి గతించినభర్తను బ్రదికించుకొని ఆశ్రమంబు నకు జేరువఱకును సావిత్రివర్తనము స్త్రీల కాదర్శమైనదే. అందును బాలికల వివాహవయస్సును పెంపుజేయనెంచు నిక్కాలమున సావిత్రి వివాహసందర్భమునందలి వృత్తాంతము కన్నెలును, వారిజనకులును గమ నింపదగినవి. అవివాహితలగు బాలికల విషయమున తలిదండ్రులకు గల బాధ్యతయెంత? కన్య వరునియందు జూడవలసిన లక్షణము లెవ్వి? గుణవతియగు బాలిక వివాహవిషయమున వాఙ్మనఃక్రియలలో దేనికి ప్రాధాన్య మీయదగును? మనఃపూర్తిగా వరించిన భర్తయందు స్త్రీ యెట్టి ప్రేమభావమును గలిగియుండవలయును? దైవికములగు నాపదలందు ధర్మపత్నియగు స్త్రీ యెట్టిస్థైర్యసాహసములు చూప నగును? ఇట్టి గణనీయములగు విషయములు పెక్కులు సావిత్రి జీవి తమునందు బహునిపుణముగా పరిష్కరింపబడి ఆదర్శనీయములై తన రారుచున్నవి.

సావిత్రి దండధరునితో ప్రసంగించుట ఆమెజీవితమునందలి మఱి యొక ఘట్టములోని ఆదర్శభాగము. మనంబు భర్తృవియోగదుఃఖం బుచే సంతప్తమగుచున్నను కలంక జెందక, తొట్రుపాటు లేక, ధర్మం బు మీఱక సమయోచితముగా మృదుమధురమనోజ్ఞసల్లాపంబులచే శమనుని చిత్తంబు రంజింపజేసి తన పతిజీవంబు గొనివచ్చినసావిత్రి వాక్కౌశలము స్త్రీ లెల్లరు నేర్చుకొనదగినది.

నిర్మలమైనమనస్సు, ఆమనశ్శుద్ధికి దగి సత్యధర్మనిరతమైన వాక్కు, ఆమనోవాక్కులకు దగిన వినీతవర్తనము ఈవిధముగా మనో వాక్కర్మంబు లొక్కటిగా తనజీవితమునందు ప్రవర్తించి త్రికరణశుద్ధి యొక్క ప్రాశస్త్యమును సావిత్రి నిరూపించినది. ఆంధ్రనారీమణు లెల్లరు పరమపవిత్రురాలగు సావిత్రి చరిత్రమును పలుమాఱు పఠించి, అందలి నియమనీతిధర్మాదులను గ్రహించి, అలవర్చుకొని కృతార్థచరిత లయ్యెదరుగాక!